క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవికాలం కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రంలో మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి చల్లని నీటిని అందిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆ సేవా సమితి సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె శివాలయం ఆవరణలో గురువారం రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ శౌధర్ 206 మందికి వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైన్స్ సీనియర్ మేనేజర్ జయకర్, మైన్స్ డీఎం జియాలజీ నాయుడు, నరేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే సకాలంలో డీఏలు చెల్లిస్తామని, నూతన పీఆర్సీ అమలు చేస్తామని, పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాయన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా హామీల ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, పెండింగ్ డీఏలు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

బేతంచెర్ల: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించడమే కాకుండా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు అబ్దుల్ అలీం, ఎంపీహెచ్ఈఓ గఫార్, వైద్య సిబ్బంది స్వర్ణ మంజరి, రాజ్యలక్ష్మి ఉన్నారు.

ఉమామహేశ్వరుని హుండీ ఆదాయం రూ.29 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న వలంటీర్లు

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.29,18,630 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు గురువారం తెలిపారు. 2024 అక్టోబర్ నుంచి 2025 మార్చి 20వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు. ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండిమౌళిశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని పొదుపు భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీ రమణ తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

తప్పని నిరీక్షణ

- కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ఎదురుచూపులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- కార్డు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలకు దూరం
- దృష్టిసారించని కూటమి ప్రభుత్వం



బనగానపల్లె మండల తహసీల్దార్ కార్యాలయం

బనగానపల్లె రూరల్: ఆరోగ్యశ్రీ మొదలు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులుగా ఉండాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి అయ్యింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా కొత్త రేషన్ కార్డులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా పేదలు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ఆహార భద్రత లేక నష్టపోతున్నారు. అర్హులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. కార్డులో పేర్ల మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించకపోవడంతో కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో నిరంతరాయ ప్రక్రియ

గత వైఎస్సార్‌సీపీ పాలనలో (2019–2024) గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు అందజేసింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హుల ఇళ్ల వద్దకే వెళ్లి దరఖాస్తు చేయించేవారు. రోజుల వ్యవధిలోనే ఇంటికి వెళ్లి కార్డులు అందజేసేవారు. దీంతో సంక్షేమ పథకాలకు అర్హత పొందేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి తీరా ఆ వ్యవస్థనే తొలగించింది. 9 నెలలు గడిచినా ఒక్క రేషన్‌కార్డు మంజూరు చేయలేదు. మాటలతోనే కాలయాపన చేస్తోంది. లబ్ధిదారులు మాత్రం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ తొమ్మిది నెలల్లో ఎందరికో వివాహాలు జరిగాయి. కుటుంబాల్లో కొత్త సభ్యులు వచ్చారు. వీరంతా ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వంలో గంటల వ్యవధిలోనే కార్డులు మంజూరు చేసిన సంఘటనలు గుర్తు చేసుకుంటున్నారు.

మళ్లీ పాత కష్టాలేనా..?

2014–2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పట్లో అరకొరగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. అప్పట్లో కొత్తకార్డులు మంజూరు కావాలంటే దరఖాస్తుదారుడు జన్మభూమి కమిటీల చుట్టు ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి. వారి ఆశీస్సులు ఉన్న వారికే కార్డులు మంజూరయ్యేవి. ఈ కారణంగా చాలా మంది అర్హులకు అన్యాయం జరిగింది. పేదలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ పథకాలు అందేవికావు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ జన్మభూమి కమిటీలను నియమిస్తారా.. లేక కూటమి నేతలు జోక్యం చేసుకుంటారా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వారు జోక్యం చేసుకుంటే చాలా మందికి కార్డుల మంజూరులో కోతలు పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



మండలంలో కొత్తగా రేషన్‌కార్డులకు అర్హులైన పేదలు చాలా మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంత వరకు కార్డుల మంజూరుపై నిర్ణయం తీసుకోకపోవడం దారుణం. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయింది. చాలా మంది పేదలు రేషన్‌కార్డులు లేకపోవడం కారణంగా సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా కార్డుల జారీపై నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

–సుబ్బారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి, బనగానపల్లె

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు



కొత్త రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. కార్డు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్డుల మంజూరుపై ప్రజలకు తెలియజేస్తాం. మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

–నారాయణరెడ్డి, తహసీల్దార్, బనగానపల్లె

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న మలేరియా అధికారి కామేశ్వరరావు

డోన్ రూరల్: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వి.కామేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని యాపదిన్నె గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో గురువారం గ్రామాన్ని పరిశీలించారు. డెంగీ జ్వరం వచ్చిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్య వస్తే వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వినియోగించాలని తెలిపారు. గ్రామంలో మురుగు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. విషజ్వరాలపై నిర్లక్ష్యం చేస్తే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పని హెచ్చరించారు. ఆయన వెంట డోన్ సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, సీహెచ్ఓ సంధ్య ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం

డోన్ రూరల్: పట్టణంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పోషణతో పాటు చదువు ఎలా నేర్పించాలి అనే విషయాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్యను బోధించాలని తెలిపారు. సూపర్‌వైజర్లు పద్మావతి, తిప్పమ్మ, శోభారాణి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌భీ పఢైబీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభం అయ్యాయి. ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి మొదటి రోజు శిక్షణను ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కేంద్రాల్లోని చిన్నారులకు ఆట, పాటలతో నాణ్యమైన బోధన చేయాలన్నారు. విద్యను బలోపేతం చేసేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. కేంద్రాల్లో పోషకాహారంతో పాటు విద్య అందుతుందని చిన్నారుల తల్లితండ్రులకు వివరించి పిల్లలు కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఈఓఆర్డీ శివప్రసాద్, సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

వయోవృద్ధులను నిరాదరణకు గురిచేస్తే శిక్ష తప్పదు



కరపత్రాలను విడుదల చేస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిరాదరణకు గురిచేస్తే శిక్ష తప్పదని సీనియర్ సివిల్ జడ్జి తంగమని అన్నారు. వినియోగదారుల హక్కుల వారోత్సవ ముగింపులో భాగంగా గురువారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు ఏఈ నాగరాజు, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో జడ్జిని సత్కరించారు. అనంతరం వృయోవృద్ధుల హక్కులపై జడ్జి అవగాహన కల్పించారు. ముసలితనంలో కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని వృద్ధులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం లేదా కోర్టులో ఫిరాదు చేయవచ్చని తెలిపారు. ఫీజు లేకుండా న్యాయ సేవలు అందిస్తామన్నారు. టోల్ ఫ్రీ నంబరు 14567కు కాల్ చేయవచ్చని చెప్పారు. అనంతరం చట్టాలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సాదాసీదాగా జరిగింది. చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షత వహించారు. పట్టణంలో మౌలిక వసతుల రూప కల్పనలో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజ్ ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వానికి సమర్పించిన రూ.9 కోట్ల ప్రణాళికలకు కౌన్సిల్ అనుమతి కోసం ఈ సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో ఇటీవల ధ్యాన పిరమిడ్ కేంద్రం నిర్మాణానికి భూమి ఎవరు కేటాయింపు చేశారని, అనుమతి తీసుకోకుండా భూమి పూజ ఎలా చేశారని కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను ప్రశ్నించారు. భూమి పూజ చేసిన విషయం తనకు తెలియదని దాట వేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టి మున్సిపల్ స్థలాలను కాపాడాలని కోరారు. అనంతరం ప్రవేశపెట్టిన బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే ధ్యేయం



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్

డోన్ రూరల్: నాటుసారా రహిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతురావు, నంద్యాల జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు అన్నారు. ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో గురువారం నవోదయ2.0 కార్యక్రమం నిర్వహించారు. సారాతో కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. సారా జోలికి వెళితే జీవితనం నాశనం అవుతుందన్నారు. కేసులతో ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. సీఐలు వరలక్ష్మి, జయరామనాయుడు, సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

24న చలో ఢిల్లీ



ధర్నా చేస్తున్న మోటార్ వర్కర్స్

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో లారీ, ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం బేతంచెర్ల పాత బస్టాండులో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. మోటార్ కార్మికుల సమస్యలపై ఈనెల 24న ఢిల్లీలో జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఏజీపీగా శ్రీకాంత్ నియామకం



కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా పట్టణానికి చెందిన దూదేకుల ఇమాంకాశీం(శ్రీకాంత్) నియమితులయ్యారు. పట్టణానికి చెందిన ఈయన 2013లో లా కోర్సు పూర్తి చేసి కోవెలకుంట్ల కోర్టులో ప్రాక్టీస్ నిర్వహిస్తున్నారు. ఇమాంకాశీంను ఏజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా అందుకు సంబంధించిన ప్రొసిడింగ్స్‌ను గురువారం కలెక్టర్ రాజకుమారి అందజేశారు. మూడేళ్లపాటు ఏజీపీగా విధులు నిర్వర్తించనున్నారు. కోర్టుకు వచ్చే పేద కక్షిదారుల పక్షాన నిలిచి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా ఆయన తండ్రి జిన్నా కాశీం సాహెబ్ ఏజీపీ, ఏపీపీగా పనిచేశారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

కోవెలకుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, జమీలా సూచించారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం 'పోషణ్‌భీ పడాయి' అనే కార్యక్రమంపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మూడేళ్లలోపు చిన్నారులకు సంబంధించి నవచేతన, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆదర్శిల అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకనుగుణంగా ఆటపాటలతో కూడిన విద్యాబోధన, పోషకాలతో కూడిన ఆహారం అందించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణంలోని ఓ పాడుబడ్డ ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: ప్యాపిలి మండలం ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బొజ్జన్నపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇమిడి లక్ష్మణ్‌సాయి డిమాండ్ చేశారు. అతన్ని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పరామర్శ



కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మద్దిలేటి స్వామి ఆలయ మాజీ ధర్మకర్త బెలుం కృష్ణా రెడ్డి గుండెపోటుతో మంగళవారం మృతి చెందిన విషయం విధితమే. గురువారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి గ్రామానికి వచ్చి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, పార్టీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

పేద రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

డోన్ టౌన్: ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి లీలా వెంకటశేషాద్రి అన్నారు. గురువారం పట్టణంలోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమై వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రిమాండ్ ఖైదీల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న లీగల్ సర్వీస్ అథారిటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 70 ఏళ్లు పైబడిన వారి కేసులను త్వరితగతిన విచారణ చేపట్టేలా చర్యలు తీసుకుంటాని తెలిపారు. అలాగే వారి ఆరోగ్యం, జైలులో వైద్య సదుపాయాలు, భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం స్వయంగా దరఖాస్తు చేసుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వం తరుపున న్యాయవాదిని కేటాయించి ఉచిత సేవలు అందిస్తామన్నారు. హైకోర్టు ఆదేశాలతో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని.. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం జైలు పరిసరాలు, భోజనశాల, ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, కోర్టు ఉద్యోగులు కళ్యాణి, ఇందిర ఉన్నారు.

టీబీ నిర్మూలనే లక్ష్యం



కర పత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

డోన్ టౌన్: సమాజంలో టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజా, సామాజిక కార్యకర్తలు మమ్మద్‌రఫీ, ఏఈ నాగరాజు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం క్షయవాధి లక్షణాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో క్షయవాధి నివారణ కోసం ఉచితంగా మందులు, పోషకాహార కిట్లను అందజేస్తారని.. వీటిని క్రమం తప్పకుండా వాడితే వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించి సమాజంలో టీబీ నివారణ కోసం అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ మస్తాన్, సీనియర్ అసిస్టెంట్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతే ఆరోగ్యానికి రక్ష



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే దంతాలతో పాటు నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్యుడు వెంకటేశ్వర్లు, వైద్యురాలు వాణి స్వప్న ప్రియ అన్నారు. గురువారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంత సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి టూత్ బ్రష్‌ను మార్చడమే కాకుండా 6 నెలలకు ఒకసారి దంత వైద్యున్ని సంప్రదించాలని సూచించారు.

మాల, మాదిగలను విడదీయొద్దు



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

బేతంచెర్ల: అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మాల, మాదిగలను ఎస్సీ వర్గీకరణ పేరుతో విడదీయ వద్దని మాల మహానాడు సంఘం నాయకులు మేకల నాగరాజు, రూబేన్, సుధాకర్, శివయ్య, సుమంత్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు దేవరాజు, నల్లన్న, మునిస్వామి, రంగస్వామి, సత్యరాజు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

సంజామల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 6,9,10,11,12 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలేఖ గురువారం తెలిపారు.ఆసక్తి ఉన్న వారు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

డోన్ టౌన్: పట్టణంలోని గోదాదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పాతళం సుబ్బారావు, రజని దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో వధూవరులుగా అలంకరించారు. వేద మంత్రాలు, డోలు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.